నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 3 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

సభలను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం దుమ్ముగూడెంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభను ఆర్డీవో మంగీలాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అధికారులకు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే ఆరు గ్యారెంటీలను ప్రతి పేదవానికి అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సున్నం సమ్మయ్య, మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, మండల కార్యదర్శి కణితి రాముడు, సీనియర్ నాయకులు కొత్తూరు సీతారామారావు, కెల్లా శేఖర్ పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీగా బలరాం డైరెక్టర్(పా)కు అదనపు బాధ్యతలు

సింగరేణి సీఎండీ బాధ్యతలు స్వీకరిస్తున్న బలరాం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా ఎన్.బలరాంనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు డైరెక్టర్(పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్)గా పనిచేస్తున్న ఆయన సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో సింగరేణి సీఎండీగా పనిచేసిన ఎన్.శ్రీధర్‌ను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. దీంతో సీఎండీ పోస్టు ఖాళీ అయింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బలరాం అదనపు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా.. బాధ్యతలు తీసుకున్న ఎన్.బలరాం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని, సీఎస్ శాంతికుమారిని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. 'ఆరు గ్యారెంటీల'ను అమలు చేసి తీరుతాం

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా అర్హులకు పథకాలు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జనవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికలు కొనసాగుతున్నాయన్నారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీస్సులతో విజయం సాధించాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి రోజే ప్రజలకు ఇచ్చిన హామీల్లో ముందుగా ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని అమలు చేశామని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించి వాటికి చట్టబద్ధత కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశామని, వాటి అమలుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా 24 గంటల కరెంట్ ఇచ్చి తీరుతామని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులందరికీ పథకాలను అందిస్తామని అన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకూ స్థలం మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన అందించి అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తామని అన్నారు.

దళితబంధుపై నీలినీడలు

- ఖమ్మం జిల్లాలో మంజూరైనవి 3,945 యూనిట్లు
- యూనిట్‌కు రూ.10 లక్షలు చొప్పున బ్యాంకుల్లో జమ
- మొదటివిడతలో యూనిట్లు ప్రారంభించిన లబ్ధిదారులు
- మిగిలిన సొమ్ముల కోసం ఎదురుచూపులు
- జిల్లా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ఖమ్మంలోని లారీ ఇంజిన్ ఆయిల్ యూనిట్

ఖమ్మం కాల్వొడ్డులోని శారీ రోలింగ్ సెంటర్

ఖమ్మం, జనవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దళితుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంపై నీలినీడలు అలుముకుంటున్నాయి. రాష్ట్రంలో దళితుల ఆర్థికాభివృద్ధిని మెరుగుపర్చేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేసిన సంగతి విదితమే. అయితే ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం కొనసాగింపుపై దృష్టిసారించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో లబ్ధిదారులకు చెల్లించాల్సిన పెండింగ్ నిధులు చెల్లించలేకపోతున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సగం నిధులతో యూనిట్లు స్థాపించుకున్న లబ్ధిదారులు మిగతా డబ్బుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలాన్ని ఫైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని దళితబంధు పథకాన్ని ఆ మండలంలో ఉన్న 100 శాతం దళిత కుటుంబాలకు అమలు చేశారు. దీనిలో భాగంగా ఈ మండలంలో 3,462 మందికి దళితబంధు పథకంలో వివిధ యూనిట్లను మంజూరు చేసిన ప్రభుత్వం 60 శాతం మందికి పూర్తిస్థాయి నిధులను మంజూరు చేసి యూనిట్ల స్థాపనకు సహకారం అందించారు. ఇంకా మిగిలిన 1,486 మందికి రూ.32 కోట్ల74 లక్షల 53 వేలను చెల్లించాల్సి ఉంది. ఈ చెల్లింపులు లబ్ధిదారులకు వివిధ దశలో పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా ప్రతి నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున మంజూరు చేసిన వాటిలో మధిర నియోజకవర్గ పరిధిలో ఇంకా 55 మంది లబ్ధిదారులకు రూ.75.19 లక్షలు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. వైరా నియోజకవర్గ పరిధిలో ఖమ్మంజిల్లా నుంచి 83 మందికి యూనిట్లు మంజూరు చేశారు. వారిలో ఇంకా 53 మందికి రూ.38.78 లక్షలు చెల్లించాల్సిన అవసరం ఉంది. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో మంజూరు చేసిన 100 యూనిట్లలో మరో 17మందికి రూ.7.72 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. పాలేరు నియోజకవర్గ పరిధిలో 44 మంది లబ్ధిదారులకు రూ.86.96 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఖమ్మం నియోజకవర్గ పరిధిలో 30 మంది లబ్ధిదారులకు రూ.44.21 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల పరిధిలో ఫైలెట్ ప్రాజెక్టు మండలంతో కలిపి 3,945 మంది లబ్ధిదారులలో ఇంకా 1,685 మందికి వివిధ దశల్లో యూనిట్లకు సంబంధించిన నిధులు రూ.35 కోట్ల 25 లక్షల 39 వేలు వారి ఖాతాల్లో జమ చేసి ఉన్నాయి. వాటి విడుదల కోసం లబ్ధిదారులకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా అధికారులు మాత్రం ప్రస్తుతం లబ్ధిదారుల ఖాతాలో ఉన్న నిధుల విడుదలకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తేనే విడుదల చేస్తామని చెబుతున్నారు. లబ్ధిదారులు వారికి మంజూరైన పది లక్షల్లో మొదటి విడతగా యూనిట్‌ను స్థాపించుకుని దానిని మరింత పెంచుకునేందుకు బ్యాంకుల్లో ఉంచిన యూనిట్ డబ్బులు విడుదలకాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కొంతమంది లబ్ధిదారులు ఫైనాన్స్ సంస్థలు, ఇతర వాహన సంస్థల్లో వాయిదాలు కట్టేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

'దళితబంధు' మా తలరాతలు మార్చింది

దళితబంధు పథకంతో చింతకాని మండలంలోని దళితులందరి తలరాతలు మారాయి. జీవితాల్లో ఆర్థికంగా, సామాజికంగా పెనుమార్పులు వచ్చాయి. మా ముగ్గురు అన్నదమ్ములం కలిసి హార్వెస్టర్ కొన్నాము. వరికోత, పెసలు, మినుముల కోత సీజన్‌లో యంత్రం చాలా బిజీగా ఉంటుంది. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించిన కేసీఆర్ సార్ చల్లగుండాలే. మా జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్ సార్ రుణం తీర్చుకోలేనిది.

– తుడుం రవికుమార్,
ప్రొద్దుటూరు, చింతకాని మండలం, ఖమ్మం జిల్లా

మిగిలిన డబ్బు విడుదల చేయండి సారూ..

దళితబంధు పథకంలో అధికారులు నాకు రూ.6 లక్షల విలువైన గొర్రెల యూనిట్ మంజూరు చేశారు. కానీ ఇటీవల నా భర్త అనారోగ్యంతో మృతిచెందారు. నా భర్త బ్యాంక్ అకౌంట్‌లో మిగిలి ఉన్న రూ.4 లక్షలను అధికారులు ఇప్పించి మరో యూనిట్ ఏర్పాటు చేసుకునేలా నా కుటుంబానికి సహకారం అందించాలని కోరుతున్నాను.

– కొల్లి నాగమ్మ, నాగులవంచ,
చింతకాని మండలం, ఖమ్మం జిల్లా

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

ఆకాశ్ సింగ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలం, జనవరి 2 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 28వ నెహ్రూ కప్(తాళ్లూరి భారతీదేవి స్మారక) అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో న్యూ స్టార్స్ జట్టుతో తలపడిన వైఎంసీసీ ఇల్లెందు జట్టు నిర్ణీత 13 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూ స్టార్ జట్టు 10 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఇల్లెందు జట్టులో ఆఫ్ సెంచరీ సాధించిన వెంకట శివ చరణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో కుంట స్పోర్ట్స్ క్లబ్, భద్రాచలం పుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడగా.. ముందుగా బ్యాటింగ్ చేసిన కుంట జట్టు నిర్ణీత 17 ఓవర్లలో 149 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన పుట్‌బాల్ క్లబ్ 16.4 ఓవర్లలో కేవలం 82 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. 41 పరుగులు చేసిన కుంట జట్టులోని ఆకాశ్ సింగ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఇరవెంటి మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీ, నిర్వాహకులు అందజేశారు. కాగా.. కుంట స్పోర్ట్స్ క్లబ్, వైఎంసీసీ ఇల్లెందు జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. కార్యక్రమంలో నెహ్రూ కప్ నిర్వాహకులు బాలయోగి, సలీం, ఎస్డీ పాషా, గోపి, విజయ్‌చంద్, సుంకర శేషుబాబు, పామరాజు తిరుమలరావు, సీతారామరాజు, గుమ్ములూరి శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

జోరుగా జూదం

పేకాట, కోడిపందేలు, బెట్టింగ్ ఏదైనా సరే..
అనుకూలంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు
సత్తుపల్లి ఏరియాలో రెచ్చిపోతున్న జూదరులు
నిద్రమత్తులో పోలీసులు
రోడ్డుపాలవుతున్న కుటుంబాలు

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జూదం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ఏరియా పేకాట, కోడిపందేలు, క్రికెట్ బెట్టింగ్‌లకు అడ్డాగా మారింది. అదుపు చేయాల్సిన పోలీసులు నిద్రమత్తులో జోగుతుండడంతో జూదరులు రెచ్చిపోతున్నారు. పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయంటూ నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కృష్ణాజిల్లా ఒకపక్క పశ్చిమగోదావరి జిల్లాలు మరోపక్క సరిహద్దులుగా ఉండడంతో సత్తుపల్లి ప్రాంతం జూదం నిర్వాహకులకు అనుకూలంగా మారింది. సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో యథేచ్ఛగా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు.

– సత్తుపల్లి టౌన్, జనవరి 2

గతంలో జనవరి వచ్చిందంటే సత్తుపల్లి ప్రాంతంలో పేకాట, కోడిపందేల హడావుడి కనిపించేది. ప్రస్తుతం సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లోని సరిహద్దుల్లో ఏదో ఒక ప్రదేశంలోని మామిడి తోటల్లో నిత్యం మూడు ముక్కలాట సాగుతోంది. ఈ ఆటనే కొన్ని ప్రాంతాల్లో 'అందర్ బహర్', కోస్ ఆటగా పిలుస్తారు. పేకాటలోనే అత్యంత ప్రమాదకరమైన ఈ ఆట యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ఈ ఆటకు అలవాటు పడినవారు ఆస్తులు అమ్ముకొని అప్పుల పాలవుతున్నారు. జూదానికి అలవాటుపడిన జూదరులు సంక్రాంతి మాసంలో వచ్చిన పంటను అమ్మగా వచ్చిన నగదును జూదంలో పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారు. ఏడాది మొత్తం కష్టపడి సంపాదించిన సొమ్ము మొత్తం ఒకటి, రెండు రోజుల్లో జూదంలో పోగొట్టుకునే సరికి అనేకమంది అప్పుల పాలై జీవితాలను పాడుచేసుకున్న సంఘటనలూ సత్తుపల్లి ప్రాంతంలో కోకొల్లల కుటుంబాలు ఉన్నాయి. ఇంత తంతు జరుగుతున్నా జూదంను అరికట్టాల్సిన పోలీసు శాఖ అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నప్పటికీ పోలీసుల కళ్లుగప్పి మరీ తమ తతంగం మొత్తం జూదం నిర్వాహకులు కొనసాగిస్తుండడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

రాజకీయ అండదండలతోనే..!

రాజకీయ అండదండలతో తాము పోలీసుల నుంచి అనుమతి తీసుకుని మరీ జూదం నిర్వహిస్తున్నామని, వివిధ ప్రాంతాల్లో ఉన్న జూదరులకు నిర్వాహకులు ఫోన్ చేసి మరీ రప్పించి పేకాట నిర్వహిస్తున్నారనేది బహిరంగ రహస్యం. దీనికి తోడు ఫ్లడ్ లైట్లు, భారీ టెంట్లు ఏర్పాటు చేసి వచ్చిన వారికి ఖరీదైన మందు, పసందైన విందులను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన కొందరు ప్రముఖులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తమకు తిరుగులేదని, ఎమ్మెల్యే మా సొంత మనిషి అని ప్రచారం చేసుకుంటూ జూదగాళ్లను నమ్మించి మరీ తాము నిర్వహించే జూదానికి పిలిపిస్తున్నారు. వచ్చిన ఒక్కొక్కరి నుంచి వేలాది రూపాయలు ప్రవేశ రుసుము వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. భారీ మొత్తంలో వసూలు చేసిన ప్రవేశ రుసుము నగదు తాము మామూళ్ల రూపంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ముట్టజెప్పాలని జూదరులకు చెబుతూ తమ పని తాము కానిచ్చుకుంటున్నారని తెలుస్తోంది. సత్తుపల్లి ప్రాంతంలో జరిగే జూదానికి సంబంధించి ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి పోలీసు అధికారులను తక్షణమే జూదం అరికట్టాలని హెచ్చరించినట్లు కూడా సమాచారం. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆది, సోమవారాల్లో కూడా సత్తుపల్లి ప్రాంతంలో పెద్దఎత్తున జూదం శిబిరాలు నిర్వహించిన విషయం సదరు మంత్రికి తెలిసి నిర్వాహకులను మందలించడంతో జూదాన్ని నిలిపివేసినట్లు తెలిసింది.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

కల్లూరు సబ్ డివిజన్‌లో ఎక్కడ జూదం జరిగినా తన సెల్ నెంబర్ 8712659166కు కానీ, సంబంధిత మండలాల్లోని పోలీస్‌స్టేషన్‌కు లేదా 100కు తక్షణమే సమాచారం ఇవ్వాలని కల్లూరు ఏసీపీ రామానుజం చెప్పారు. పర్మిషన్ ఉందంటూ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రధానంగా సత్తుపల్లి నియోజకవర్గం ఆంధ్రా సరిహద్దులో ఉండడం వల్ల అక్కడక్కడా సమాచారం వస్తుందని, తమ సిబ్బంది వెళ్లి పరిశీలిస్తే అలాంటి సంఘటన ఏమీ సబ్ డివిజన్ పరిధిలో జరగనట్లు తెలిసిందన్నారు. ఏదేమైనా జూదానికి ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులతో కూడా సమన్వయపర్చుకుని జూదం జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

– రామానుజం, కల్లూరు ఏసీపీ

గందరగోళం మధ్య గ్రామసభలు

- సందేహాలు నివృత్తి కాక ప్రజల అవస్థలు
- ఆరు గ్యారెంటీలు వస్తాయో.. లేదోననే అనుమానం
- ఇప్పటివరకు చేసుకున్న అర్జీలన్నీ కార్యాలయాల్లోనే..

సుజాతనగర్ : గుడితండా గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామసభలు గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు తలెత్తుతున్న సమస్యలను నివృత్తి చేసేవారు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరికొందరికి దరఖాస్తు ఫారాలు అందకపోవడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు సరిపోతుందని చెప్పి ఒక ఫారం మాత్రమే ఇవ్వడంతో ఆ కుటుంబంలోనే విడిగా ఉంటున్న వారికి దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో అధికారులను బతిమిలాడాల్సిన పరిస్థితి వస్తోంది. అభయహస్తం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి ప్రాధాన్యం లేకపోవడంతో అసలు పథకం వస్తుందా.. రాదా.. అనే అనుమానం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. దరఖాస్తు ఫారంలో బ్యాంకు ఖాతా నెంబర్ లేకుండా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామసభల మొదటి రోజు నుంచి ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు తీసుకున్న దరఖాస్తులన్నీ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. అంతేకాక గ్రామసభల నిర్వహణపై ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే దరఖాస్తుదారుల అనుమానాలు పూర్తిస్థాయిలో నివృత్తి కాకపోవడంతో వారు సతమతమవుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 51,484 దరఖాస్తులు

ఇప్పటివరకు జరిగిన ప్రజా పాలన గ్రామసభల్లో ప్రజల నుంచి 51,484 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. 52,962 కుటుంబాలు వారు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. 75 గ్రామ పంచాయతీలు, 52 మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు ఫారాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 8 గంటలకే సభలు ప్రారంభించి.. సాయంత్రం 6 గంటలకు ముగిస్తున్నట్లు వివరించారు.

గిరిజన విద్యార్థులు 10 జీపీఏ సాధించాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, జనవరి 2 : ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాలు, పీఎంహెచ్ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు 10/10 సాధించేలా ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ముఖ్యంగా ఇల్లెందు డివిజన్ పరిధిలోని 13 ఆశ్రమ పాఠశాలలు, 3 హాస్టళ్లు, 7 పీఎంహెచ్ హాస్టళ్లలో విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. సబ్జెక్టు టీచర్లు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని చెప్పారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు వారికి స్లిప్ టెస్ట్, వీక్లీ టెస్ట్ నిర్వహించాలని సులభ పద్ధతిలో ఇంగ్లిష్, మ్యాథ్స్ చేయించడానికి రూపొందించిన వీడియోగ్రాఫ్‌ను తప్పనిసరిగా పిల్లలకు నేర్పించాలని చెప్పారు. ముఖ్యంగా ఈ గ్రేడ్ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కంప్యూటర్, ప్రాజెక్టర్ సాయంతో ప్రతిరోజూ విద్యార్థులకు బోధించడానికి ప్రత్యేక టీచర్‌ను నియమించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఇల్లెందు ఏటీడీఏ రూపాదేవి, జీసీడీవో అలివేలు మంగతాయారు, రమణమూర్తి, పోశాలు, హెచ్ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.

తెలి మంచు కరిగింది..


సుజాతనగర్ మండలం వేపలగడ్డలో..

'తెలి మంచు కరిగింది తలుపు తీయనా ప్రభూ..' అన్నారు ఎప్పుడో పాతికేళ్ల క్రితం వచ్చిన 'స్వాతికిరణం' సినిమాలో గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి. తాజా మంచు దుప్పట్లను గనుక ఆయన చూసి ఉండుంటే 'తెల్లవారిపోయినా తెలి మంచు కరగదేమి ప్రభూ..' అనేవారేమో. ఆయన చెప్పినట్లుగానే తెలి మంచుకు ఇలగొంతు వణుకుతూనే ఉంది. ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పడిపోతుండడంతో చలి తీవ్రత కూడా క్రమంగా పెరిగిపోతోంది. తెల్లవారి ఎనిమిది గంటలు దాటినా మంచు తెరలు తొలగిపోవడం లేదు. వేకువజాము మంచు బిందువులు కొంత ఆహ్లాదాన్ని కలిగించినా.. వాహనదారులకు మాత్రం కొంచెం అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. మొత్తంగా సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి, చర్ల మండలాల్లో మంగళ వారం ఉదయం కురిసిన హిమబిందువులు హిమసీమలను తలపించాయి.

-భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ అన్నపురెడ్డిపల్లి/ చర్ల, జనవరి 2

సుజాతనగర్ మండలం వేపలగడ్డలో ఉదయం 8 గంటలు దాటినా తొలగని మంచు తెరలు
అన్నపురెడ్డిపల్లి : రహదారిని కప్పేసిన పొగ మంచు
మబ్బుతెరల మాటున మన్యం
సుజాతనగర్ మండలంలో ..
చర్ల : మంచుదుప్పట్లు కప్పుకున్నట్లుగా కనిపిస్తున్న చర్ల మండల కేంద్రం